
కథ

# జనారణ్యం

నవులూరి వెంకటేశ్వరరావు



ఆఫీస్‌కు బయలుదేరబోతూ వాహనాన్ని సున్నితంగా శుభ్రం చేస్తున్నాడు శరభలింగం. దాన్ని బాధిస్తే, అవమానిస్తే పగబట్టి ఎక్కడో కిందపడేసి పోతుందన్న భయంతో ఉన్నట్లు. అది ఒక వింత జంతువులా ఉంది.

ఎదురు స్థలాన్ని ఆనుకుని ఉన్న రోడ్డు మధ్య నలుగురు మాట్లాడుకుంటున్నారు. ఆ విధానం, ఏదో కుట్ర పన్నుతున్నట్లుంది. అయితే కుట్రలు నడిరోడ్డు మీద జరగవు. శరభలింగం మేధావి కాకపోవచ్చు కాని, అలాంటివి గ్రహించగల శక్తి ఉంది. గత నాల్రోజులుగా ఒకే విషయం ఏ ఇరువురు ఈ ప్రాంతంలో ఎదురైనా తప్పనిసరిగా మాట్లాడుకుంటున్నారు. శత్రువులు కూడా మిత్రులై వాళ్ల ఉమ్మడి శత్రువు గురించి భయం భయంగా ముచ్చటించుకుంటున్నారు. వాళ్ల వైపు ఓ క్షణం చూశాడు నిర్లిప్తంగా. తర్వాత చూపును భార్య మంగతాయారు వదనం మీదికి ప్రసరించాడు. ఆమె మొహంలో నాలుగురోజులుగా ఈ వేళ్కు ఒకటే భావం, భయం. భావాల భాష ఎక్కువగా అతనికి రాదు. కొన్నింటిని మాత్రం అతని బుర్ర అర్థం చేసుకోగలదు, మొహం వ్యక్తం చేయగలదు.

ఆమె భావం: అడవి జంతువు సంచరిస్తోంది కదా, చీకటి పడకుండా వచ్చేయండి.

నేను ఏ వేళకు కార్యాలయం వదలాలో నిర్ణయించే అధికారం నాకు లేదని నీకు తెలీదా మంగా? చూపుతోనే సమాధానం చెప్పి బండి ఎక్కాడు. సాగుతోంది ప్రయాణం...

పక్కనే ఉన్న కొండలమీది నుంచి దారి తప్పి వచ్చిన ఎలుగ్గొడ్డు అయిదురోజులుగా దాడులు చేస్తోంది గెరిల్లా పద్ధతిలో. నాగరికులమీద, నాగరికత మీద ఏదో పగ పట్టినట్లు. దాని పుణ్యమా అని ఎవరినీ తీవ్రంగా గాయపరచడం కాని, చంపడం కాని చెయ్యలేదు. మనుషులలో అటవికత్వం ఉన్నట్లే, ఆ అడవి జంతువులో మానవత్వం ఉందేమో. దానికి కొస్తంత హాస్యదృష్టి, కించిత్ శృంగారభావం ఉన్నట్లు మాత్రం నిరూపితం అయింది. ఎట్లానా? అడ్డుగా మూడడుగులుండే నాంచారమ్మగారు ఒళ్లు తగ్గించుకుందామన్న అత్యాశతో, ఒంటరిగా అసుర సంధ్యవేళ గజగమనంతో నడుస్తున్నప్పుడు, వెనుక నుంచి వచ్చి వాటేసుకుని, వదిలేసి పారిపోయింది జంతువు. మరే హానీ చెయ్యలేదు. కేకలేస్తూ, ఆమెకే ఆశ్చర్యం కలిగేంత వేగంతో పారిపోతూ, ఆమె కాలుజారి పడిపోయింది. జనం దూరం నుంచి పరుగెత్తుకొచ్చి ఆమెను ఏడుకొండలు వైద్యాలయంలో చేర్పించారు. రక్తపోటుకు వైద్యం చెయ్యించుకుంటూ 302వ గదిలో వెల్లకిలా పడక నిండుగా పడి వుంది కృష్ణుణ్ణే ప్రార్థిస్తూ.

కొట్టక్కర్లేదు తిట్టక్కర్లేదు, వాటేసుకుని వదిలేస్తే నాంచారమ్మ చావు నాంచారమ్మే చస్తుందన్న తెలివితేటలతో ఎలుగ్గొడ్డు అలా చేసిందా? జంతువుకు మేధస్సు లేదు కాబట్టి అలా అనుకోవటానికి లేదు. మేధ, ఆ కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే తెలివితేటలు మానవజాతి సొత్తు. ఈడెను వనంలో జ్ఞానఫలం ఆరగించి పొందినాది. అది పొందినందుకు అన్యాయంగా శపించాడు యెహోవా. దానిమీద అప్పీలుకు పైకి పోవడానికి మనిషికి అవకాశం లేకపోయింది. నాంచారమ్మను అవమానించడం కూడా భల్లూకం ఉద్దేశం అయివుండదు.

వారసత్వంగా మనిషికి వచ్చే తెలివి తేటలను సాటి వ్యక్తి ఒకడు ఒక అత్యాచార సంఘటనలో ప్రదర్శించాడు. ఈ కథ కాని కథ సహోద్యోగి వసంతరావు చెప్పాడు. సంతోషం అనే మనిషి

సంతానం అనే ఒకనాటి "ప్రాణమిత్రుడి' భార్య మీద గండుబిల్లిలా అత్యాచారం చేశాడని. ఇరువురూ చేస్తున్న వ్యాపారంలో సంతానం మూడు లక్షలు కైంకర్యం చేశాడని. అది రాబట్టుకోడానికి ఎంత ఆలోచించినా మార్గం చూపని మెదడు పగ తీర్చుకునే ఉపాయం మాత్రం ఇచ్చింది. అత్యాచారాలు సాధారణ పైశాచికాలై పోయినాయి. కామాగ్ని వివేచనను, వివేకాన్ని హరించి చేసేవే అధికం. ఈ అత్యాచారం విభిన్నమయినది. అది జరిగిన మరుసటిరోజు అప్పుల దగ్గర అన్నాడట సంతోషం...

"జీవితాంతం కారాగారంలో కూర్చున్నా నా గురించి ఏడవటానికి లేరెవ్వరు, ఒంటరి వాడిని. నన్ను మోసం చేసిన సంతానం గాడికి సరైన శాస్తి చేశాను. వాడి గౌరవాన్ని మంట గలిపాను. వాడు మానసికంగా నరకంలో జీవిస్తాడు; నేను కటకటాలవెనుక జీవిస్తే, నేను పాడుచేసిన స్త్రీని వాడు ఇల్లాలుగా భరించాలి. అనుక్షణం అవమానంతో కృంగిపోతూ, పెళ్లాంతో కలసి వీథిలో నడవలేడు. ఊహ తెలిసిన తర్వాత తమ తల్లి చెడిన శీలం గురించి వాడి పిల్లలకు తెలీకుండా ఉండదు..." ఇలా సాగిపోయిందట ధోరణి.

సంతానం భార్యను శిక్షించడం ద్వారా, సంతానం మీద పగ తీర్చుకున్నాడు. తెలివితేటలంటే అవి. ప్రస్తుతం సంతానం, అతని భార్యా అజ్ఞాతంగా తిరుగుతున్నారట.

ఇక్కడ శారీరక హింస కాదు ప్రధానాంశం. అవమానించి, అవతలివాడి గౌరవాన్ని హరించి, శారీరక హింస కలిగించే బాధకన్నా ఎన్నోరెట్లు మానసిక వేదనకు పాటి మనుషులను గురిచెయ్యడం. సంఘం దృష్టిలో అమానుషంగా ప్రవర్తించిన వాడి గౌరవం కాదు అధికంగా పోయేది... బాధితుడిది/బాధితురాలిది.

ఈ ఉదంతంలో న్యాయవ్యవస్థ రంగంలోకి దిగింది. ఏం లాభం? సంతోషానికి శిక్షపడినందు వలన సంతానానికి, అతని భార్యాపిల్లలకు జరిగిన వ్యక్తిగత నష్టం భర్తీ కాదు. కాకపోతే, వాళ్లలో 'కసి' ఉంటే అది తీరుతుంది. ఎక్కడైనా చట్టం నేరం జరిగిన తర్వాత పని చెయ్యడం ఆరంభిస్తుంది. నేరం జరగకుండా చూసే అవకాశం దానికి లేదు.

అయిదురోజుల నాడు లింగానికి అయిన ఒక చేదు అనుభవంలో నేరం జరిగిన తర్వాత కూడా చట్టం ఏ పాత్రా తీసుకోవటానికి అవకాశం లేకపోయింది. ఆ అనుభవాన్ని జీవితంలో మరువలేడు.

అతను ఇంటి నుంచి బయలుదేరినా, ఇంటికి చేరాలన్నా రెండు మార్గాలున్నాయి. ఒకటి పురపాలక సంఘం వారి బడిమీద నుండి వెళుతుంది. రెండవది, తండోప తండాలుగా గేదెలను పెంచే విస్తారమైన స్థలం మీదుగా వెళుతుంది. బడికి వంద గజాల దూరంలో అద్దె లారీల కార్యాలయం ఉంది. అది ఒక పెద్ద గది. దానిముందు బల్లలు రెండు ఎదురెదురుగా వేసివుంటాయి. ఒకదానిమీద కొజ్జాలు, మరొకదాని మీద అలా కానివాళ్లు కూర్చుని ఉంటారు. సోమరి కబుర్లు ఎక్కువగా సాగుతుంటాయి. గది గుమ్మంలో అడ్డుగా కూర్చుని ఉంటాడు ఖడ్గమృగం లాంటి పానకాలు. ఆ మృగానికి కొమ్ము ఉంటుంది. ఈ జీవికి అది ఉండదు. మృగం గోపాల్ జర్దా సేవించడు, పానకాలు సదా అది సేవిస్తుంటాడు. అంతే తేడా. మనిషి, మృగం ఒకే కర్మాగారంలో తయారవుతారని పానకాలను చూసి గ్రహించవచ్చు. ఒక్కోసారి మనిషిలాంటి మృగం, మృగంలాంటి మనిషి సృష్టించబడటం కద్దు. పానకాలకు హిజ్రాలతో స్నేహం ఎందువలన ఏర్పడిందో వాళ్లకు, పానకాలకు మాత్రమే తెలుసు. వాళ్లతో చెలిమి కలిగివుండటంలో తప్పులేదు. వాళ్లని వేరుగా, హేళనగా చూడటం ద్వారా సమాజం తన క్రూరత్వాన్ని తనే చాటుకుంటుంది. ఆడ, మగలలో కంటే వాళ్లలో బహుశ ఉత్తములు ఎక్కువమంది ఉండవచ్చు. బారెడు పూలమాలలు ధరిస్తుంటారు. లంగా ఓణీలలో ఉంటారు. తీరుబడిలేనట్లుగా తిరుగుతుంటారు. వాళ్లబాధలు, సమస్యలు వాళ్లవి. వాళ్ల గురించి ఇంతలా ముచ్చటించటానికి కారణం లేకపోలేదు.

ఎప్పుడూ గంభీరంగా ఉండే పానకాలు ఆరోజు ఖుషీగా ఉన్నాడు. ఆ సరదాలో ఒక కొజ్జా ఏదో అన్నట్లుంది. ఆమెను తరిమాడు. ఆ ఒగలాడి అతనికి చిక్కకుండా పరుగెత్తింది, రోడ్డుకు అడ్డుగా. రహదారులు ఆటస్థలాలు కూడా. బ్రేకు వేసినా శరభలింగం స్కూటర్ ఆగలేదు. పానకాలంటే భయపడకుండా అతన్ని గుద్దింది. అతనికి పెద్ద దెబ్బ తగలలేదు కాని, పరుగెత్తడంతో నడుం దగ్గర వదులైన లుంగీ జారిపోయింది. లుంగీ ఎత్తి పట్టుకుని, రెండో చేత్తో లింగాన్ని చెంప దెబ్బ కొట్టాడు. మంత్రం వేసినట్లు లింగానికి నోట మాటరాలేదు. ఎదిగిన వయసులో ఏనాడు, ఎవరు తనపై చేయి చేసుకోలేదు. అలా చేయి చేసుకునే వీలుందని అతనికి ఎప్పుడూ తట్టలేదు కూడా.

వినోదరాహిత్యంతో బాధపడుతున్న జనం అవకాశాన్ని వృథా చేసుకోరు. క్షణంలో గుమ్మికూడారు. పానకాలును తిరిగి కొట్టటానికి చెయ్యెత్తాడు లింగం. తిరిగి దెబ్బతీయటమే పోయిన తన గౌరవాన్ని తెచ్చివ్వగలిగిన మార్గంగా తోచింది ఆ క్షణాన. జారిన లుంగీతో పోయిన పరువును లింగాన్ని కొట్టటం ద్వారా పానకాలు తిరిగి సంపాయించగలిగినట్లు. లింగం ప్రయత్నం ఫలించలేదు. ఇద్దరు మనుషులు శరభలింగాన్ని పట్టుకున్నారు. జనంలోని కొందరు సర్దిచెప్పబోయారు. "వేగంగా వాహనాన్ని నడపడం వలనే ఆ ప్రమాదం జరిగింది" అని వాళ్లు తేల్చి చెప్పారు.


"చిన్న లెంపకాయకు అలా ఉద్రేకపడుతున్నారు. కాని, పానకాలు గారిగి ఎంత దెబ్బ తగిలివుంటుందో ఆలోచించండి" దుమ్మలగొండి సహోదరుడి లాంటి వాడు ఒకడు పిడికిలి బిగించి అన్నాడు.

"అతగాడు రోడ్డుకు అడ్డుగా ఉంటే ప్రమాదాలు జరగవా" శరభలింగం అడిగాడు.

"మీరు బండి తోలుతున్నారు కదా అని రోడ్డు మీద మనుషులుండకూడదనటం ఏం న్యాయం? మనుషులను తప్పించుకుంటూ బండి తోలాలి"

"పోనీలెండి గురూగారు గొడవెందుకు... మీదారిన మీరు పొండి" శరభలింగాన్ని పట్టుకుని ఉన్నవాళ్లలో ఒకడు అన్నాడు.

శరభలింగాన్ని పట్టుకుని ఉన్న వాళ్లిద్దరి శరీరాలు అతనికి తగులుతూ జుగుప్సగా ఉండి, రెండు బురదలో పొర్లిన మొసళ్ల మధ్య ఇరుక్కున్నట్లు. పరిహాసానికి వాళ్లు తనను పట్టుకుని ఉంచినట్లు అర్థమై కోపం అధికమైంది.



వీళ్లందరి మీద తన కోపం ఎలా తీరుతుంది?

"మీరు ముందు వదలండి" అన్నాడు శరభలింగం.

"ఏం వదిలితే మరో రెండు తన్నులు తింటావా?" లుంగీ మరోసారి బిగించుకుంటూ పానకాలు అన్నాడు.

"నీ ప్రాణం తీస్తా"

"నీ తాత రావాలి బే. గట్టిగా గుద్దితే చస్తావని లెంపకాయతో వదిలేశా"

"ఇది చిన్న విషయం. పట్టించుకోకండి" పెద్దపులికి వంతపాడే నక్కలాంటి వాడు అన్నాడు.

నలుగురు హిజ్రాలు బల్లమీద కూర్చుని వింతను చూస్తున్నారు. ఒకర్తె లేచింది. పానకాలకు చేరువగా వెళ్లింది. పానకాలుతో ఏదో గుసగుసలాడింది. ఏదన్నా కుట్రా? అంతా క్షణాల్లో జరిగిపోయింది. జనం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు జరగబోయే తరువాతి దృశ్యం గురించి. శరభలింగం ఎదురుగా నిలబడింది. రెండు చేతులతో చీరను అటూ ఇటూ పట్టుకుని.

"ఏందయ్యా తెగ పేలుతున్నావూ. అందరి మీదా ఎగిరిపడుతున్నావూ. మొనగాడివా. దా, ఏం చేత్తావో చెయ్యి" అనింది.

అలా అని ఊరుకుంటే సంతోషం. కథను ఆఖరి మలుపు తిప్పింది ఆమె. జరిగిన అవమానానికి ఉడికిపోతూ, సిగ్గుతో సగం చచ్చిన శరభలింగానికి యావత్ మానవజాతి మీదే రోత పుట్టిన పని చేసింది.

తొడలు కనిపించేలా చీర ఎత్తి చూపించింది.

ఆమె కూడా మనిషే. లింగ వైకల్యం ఉంది. అంతే; మేథావైకల్యం లేదు. వినూతన, విభిన్నమార్గాలలో మనిషిని అవమానించగలిగిన మేథాసంపత్తి ఆమెకూ ఉంది.

ఆస్థలం నుంచి ఎలా నిష్క్రమించాడో శరభలింగానికి గుర్తే లేదు. ఒక మనిషి సాటి మనిషి మీద చెయ్యి చేసుకోవడం అనాగరిక చర్య అని నమ్ముతాడు. ఆ ఉదంతంలో తను తప్పు చెయ్యకుండా నడిరోడ్డుమీద, బజారు మనుషులు సాక్షిగా, బజారు మనుషుల చేత శిక్షించబడ్డాడు. ఒక వెధవ చేసిన లెంపకాయతో సంఘం దృష్టిలో గౌరవాన్ని, హుందాతనాన్ని కోల్పోయాడు. నిజానికి అతని మీద అతనికే గౌరవం పోయింది. అంత తేలిగ్గా పోతే గౌరవం ఉంటేనేం, ఊడితేనేం అని జరిగిన దానిని తేలిగ్గా తీసుకోవాలా? లేక, అతి తేలిగ్గా చిదిగిపోయే అపురూపమైన గాజు వస్తువు అనుకుని పోయినందుకు విలపించాలా? హిజ్రా చర్యను ఎలా వర్ణించాలి? అనాగరికం అని పిలుద్దామంటే, అదే నేటి నాగరిక ప్రవర్తనేమో! కోల్పోయిన దానిని తిరిగి పొందేదెట్లు? ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య వాళ్లకు తెలీకుండా ఏదో నేరం చేసినవాడిలా ప్రవర్తించాడు. వాళ్లు తనకిచ్చే గౌరవానికి తను అనర్హుడిని అనుకున్నాడు.

... వాహనాన్ని షెడ్డులో ఉంచి తన బల్ల దగ్గరకు వెళుతున్నాడో లేదో అధికారి పిలుస్తున్నాడని బంట్రోతు కబురుతెచ్చాడు. భామినితో కలిసి వరహాలరావు పెందలాడే వచ్చాడట. ఆఫీసుకు లింగం రావటం పదినిమిషాలు ఆలస్యం అయింది. దాని గురించి పిలిచాడా? సుంకాల వసూళ్ల పట్టికలు తయారు చెయ్యమంటున్నాడు... దీన్ని గురించా? అదైనా, ఇదైనా తినిపించాల్సిన నాలుగు గురించే పిల్చి ఉంటాడు. తినబోతూ రుచి గురించి ఆలోచించడం వృథా. ఒక్కడూ ఉన్నప్పుడు ఎంత తిట్టినా ఫర్వాలేదు, బాధ తప్పదు కాని చనిపోవాలనిపించదు. భామిని ముందు తిడితేనే ఆ పని చెయ్యాలనిపిస్తుంది. ఆ విషయం



వరహాలరావుకు తెలుసు. అలాంటివి బాగా తెలుసు కాబట్టే అధికార నిచ్చెన మెట్లు ఎన్నో ఎక్కివచ్చి ప్రస్తుత పీఠాన్ని అధిరోహించి ఉన్నాడు. లంచాలు తింటేనేం కాక, ముండనుంచుకుంటేనేం కాక అతను చక్కని ఆలోచనాపరుడు అని వీధిలో కుక్కకూడా ఒప్పుకుంటుంది.

లింగం గుహలోకి అడుగుపెట్టాడు. తనకింద పనిచేసే ఉద్యోగిలా కాక బద్ధశత్రువును చూసినట్లు చూశాడు శరభలింగాన్ని వరహాలరావు. అతను తోడేలుగా కనిపించి కళ్లు మూసేసుకుందాం అనుకుని వెంటనే మానేశాడు లింగం. మరీ భయకంపితం అయినట్లుంటుందని, అది అవమానకరమైన విషయమని. మధ్యేమార్గంగా నేలకు చూపులు గుచ్చి ఉంచాడు. అంతకు ముందే ఆ పనిచేస్తున్న వసంతరావు, కృష్ణబాబులాగా.

కోపంతో తిట్టు ఉపన్యాసం అందుకోబోయే ముందు పురిటి అడివిపందిలా శబ్దాలు చేస్తాడు వరహాలు గొంతుతో. దానికి లేనివి అతనిలో/అతనికి ఉన్నాయి. ముందే చెప్పినట్లు తెలివితేటలు, లంచగొండితనం, దుర్మార్గం, అధికార మధుపాన మైకం, బహు అందమైన ముండ. పట్టమహిషికి వయసును మించిన వార్ధక్యం, అది తెచ్చిన రోగాలు పుట్టెడు ఉన్నాయి. అలాంటి జీవితాన్ని కూడా ఎంతో ఇష్టంగా కొనసాగించ కలుగుతోందంటే దానికి ఒకే ఒక కారణం ఉంది. అదే ఎప్పటికీ తీరని ధనేచ్ఛ. ఆమె ధన దాహాన్ని తీర్చే నిరంతర కార్యంలో పెనిమిటి తలమునకలై ఉంటాడు కాబట్టి, భామినితో అతను వెలగబెట్టే నిర్వాకానికి ఆమె అడ్డురాదు.

భామిని అప్పుడప్పుడు వస్తుంది కార్యాలయానికి. వరహాలు గదిలో కాస్సేపు గడిపి వెళ్లిపోతుంటుంది. కొందరు ఆమె ద్వారా వరహాలు చేత పనులు చేయించుకుంటారని ఆమె కష్టాన్ని వృథాగా పోనీయరని అందరూ అనకుంటుంటారు. అందరూ అనుకున్నదల్లా నిజం కాకపోవచ్చు; ఎవరూ అనుకోనిది అబద్ధమూ కాకపోవచ్చు. పుకార్లను అతని అప్తులు అతని దృష్టికి తీసుకెళ్లినప్పుడు "నిజం నిలకడ మీద తెలుస్తుంది" అని ఆవేదనతో అంటాడు; భామినిని ఆఫీసుకు రావద్దని అనడు. అంటే ఆమె బాధపడుతుంది; ఆమె బాధను అతను భరించలేడు.

ఆమె రావచ్చు. ఆమె పనులు ఆమె చేయించుకుపోవచ్చు. సిబ్బందికి ఆ విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదు. వచ్చిన చిక్కేమిటంటే ఆమె ఆయనగారితో ఆఫీసులో గడిపినంతసేపు వాళ్లు (సిబ్బంది) ప్రాణాలు అరచేతిలో ఉంచుకోవలసిన అవసరం పడుతుంటుంది. ఆమె ముందు సిబ్బందిని పరిహసించటం అధికార మార్గాలానికి ఎంతో ఇష్టం. ఎలుక మాంసం కన్న, పళ్లెంలోని పాల కన్న, ఆమె ముందు అతని అధికార ప్రదర్శన పెడతోవలు పడుతుంది.

ఆమె చూపుడువేలు వయ్యారంగా బుగ్గకు ఆనించి వరహాలు ముఖంలోకి గోముగా చూస్తోంది. ఆసక్తిగా అతని మాటలు వింటోంది. అలాంటి భంగిమను తట్టుకుని ఏ అధికారీ తనిది కాని కార్యాలయాన్ని రానివ్వకుండా ఉండలేడు. శరభలింగం ప్రవేశం వరహాలు మాటలకు విరామం ఇచ్చింది.

అతను జీతానికి పనిచేసే అధికారే కాదు, మేధావి, స్వాప్నికుడు, దార్శనికుడు. దేశం, మానవ సమాజం ఎప్పటినుంచి, ఎలా ఎందుకు పాడైపోయాయో అతనికి బాగా తెలుసు. ఆ రెండింటి మీద వాగాడంబరంతో మాట్లాడటం అతనికి ఇష్టమైన బలహీనత. లింగం

వచ్చేసరికల్లా అతను చెప్పాల్సిందల్లా చెప్పేసి ఉండటం వల్ల, మిగిలినది కాస్త కొనసాగించి, ముక్తాయింపుతో ముగించాడు.

"మానవ మేధస్సు వరిఢవిల్లుతున్న ఒకానొక దేశంలో స్పిట్టింగ్ సెల్ (spitting cell)ను కనుగొన్నారు. తెలుగులో ఉమ్మి చెరసాల అనొచ్చు. మన సృజనాత్మక శక్తికి ఆకాశం హద్దు. ఒక పొడవైన పెట్టె గోడలోకి అమరి ఉంటుంది. అందులో నేరస్తుడిని బంధిస్తారు. వాడు ఎటూ కదలటానికి, మెదలటానికి వీలవ్వదు. చేతులు పైకి ఎత్తటానికి వీలు కాదు. అలా నిలబడే ఉండాలి. ఆ పెట్టె తలుపు వాడి గడ్డం దాకా వచ్చి ఆగిపోతుంది. అంటే వాడిముఖం మాత్రం ఇతరులకు కనబడుతుంది. మొఖానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తాం. అటు వక్క వెళ్లే చెరసాల ఉద్యోగి ప్రతివక్కడు నేరస్తుడి ముఖంమీద ఉమ్మి పోతుంటాడు. ఆ మనిషి చెయ్యి ఎత్తే వీలు లేదు కాబట్టి, ఉమ్మి తుడిచేసుకునే వీలు లేదు. కాకపోతే, ఉమ్మి కంట్లో పడకుండా కనురెప్పలు మూసుకునే వీలుంది. నేను అనుకుంటాను. కనురెప్పలు మూసుకునే వీలు మాత్రం ఎందుకుండాలి అని. నేరస్తుడి ఒక్క రక్తపు చుక్కా రాలకుండా, మరో శారీరక హింసకు పూనుకుని శ్రమపడకుండా ఎలాంటి చక్కటి శిక్షను వెయ్యవచ్చో చూడండి! నేరము-శిక్షల వ్యవస్థను పునర్నిర్మించాలి. విభిన్న, వినూతన శిక్షలను కనపెట్టడం ద్వారా నేరపూరిత సామాజిక వాతావరణాన్ని ప్రక్షాళనం చెయ్యొచ్చు. దీన్నంతా కథగా చెప్పి మిమ్మల్ని రంజింప చెయ్యటం కాదు నా అభిమతం. పని చెయ్యని కార్మిక, ఉద్యోగవర్గం వల్లనే ప్రభుత్వరంగ సంస్థలు దవాఖానా పడకమీద ఉన్నాయి. ఆ వర్గాన్ని నిర్దాక్షిణ్యంగా శిక్షించడం ద్వారానే కొత్త పని సంస్కృతిని దేశంలో ఆవిష్కరించగలం. అలాంటి ఆవిష్కరణ వల్లనే ఖాయిలా పడే పరిశ్రమలను బతికించి బట్ట కట్టించవచ్చు. ఆ ముప్పై పట్టికలను తయారు చెయ్యమని మొన్నటి నుంచి చెబుతున్నా మీరు ఖాతరు చెయ్యటం లేదు. ఉమ్మి చెరసాల మన కార్యాలయంలో ఉంటే? అలాంటి అవసరం లేదనిపించేలా ఈ రోజు రాత్రి ఏ వేళకైనా పని ముగించి వెళ్లండి."

బుసలు కొట్టే బదులు ఛీత్కరించి, కనిపించే విషంకన్నా దారుణమైన కనిపించని దాన్ని కక్కేడు. మిగతా ఇద్దరి మాటేమో కాని, లింగం మాత్రం అక్కడే, ఆ క్షణాన్నే ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. దానికి ఉపకరించే పరికరాలు... ఎలుకల మందు, నీటిబావి, నిప్పు, కత్తి, నిద్రమాత్రలు... లభ్యం కాకపోవటం వల్లనేమో ఆ పని మానుకున్నాడు. ఒకవేళ అలాంటివి దొరికినా, వరహాలరావు ముందు మరణించటానికి దమ్ములు లేవు. జంతు గుహనుంచి బయటపడినట్లు ముగ్గురూ వెలుపలికి వచ్చారు. బాల్కనీలో నాలుగడుగులు వేసిన తర్వాత, దుమ్ము అంటకపోయినా చొక్కా దులుపుకున్నాడు వసంతరావు. అరచేత్తో మొహం తుడుచుకున్నాడు, నవ్వుతూ. ఆ అయిదో అంతస్తు బాల్కనీ నుంచి కిందికి చూశాడు శరభలింగం. అంత ఎత్తు నుంచి కిందికి చూస్తుంటే భయం వేసింది.

"స్పిట్టింగ్ సెల్‌లో వరహాలని ఉంచాలా మనల్ని ఉంచాలా?" నవ్వుతూ అన్నాడు వసంత.

"అధికారం ఎవడి చేతిలో ఉంటే వాడు అవతలి వాడిని ఉంచగలడు. ఈ విషయం, వెనక్కెళ్లి వరహాలనే అడిగితే పోతుంది కదా" క్రిష్ణ అన్నాడు.

"పెద్దపులి గాండ్రింపులు వినటం ఒకటే చేయగలం మనం. దాని భాషలో దానితో మాట్లాడలేం" నవ్వుతూ అన్నాడు వసంత.

"మొహంమీద ఉమ్మేసినా నవ్వగలగడం అద్భుతమైన లక్షణం" విచారంగా అన్నాడు లింగం.

"స్పిట్టింగ్ సెల్‌లోని మనిషి మొహం మీద ఊసినప్పుడల్లా... అది తుడిచేసుకోలేకపోయినా... ఆ అవమానాన్ని తేలికగా తీసుకుని నవ్వుతూ ఉంటాడనుకో, అప్పుడు అది శిక్ష అవ్వదు. వాడిని అవమానించి, బాధించడానికి, వాడి హుందాతనాన్ని, గౌరవాన్ని పారించడానికి మరో గొప్ప సాధనాన్ని కనుగొనాలి" క్రిష్ణ అన్నాడు.

"గౌరవం, అవమానం అనుకుంటు మథన పడితే జీవించగలమా?" అన్నాడు వసంత.

"గౌరవంగా, హుందాగా, నీతిగా, మంచిగా జీవించలేని జీవితం ఎందుకు?" లింగం అన్నాడు.

"మనం ఎలాంటి జీవితం, ఆదర్శవంతమైన సమాజం ఆశిస్తామో అవి దొరకవు. పుట్టటం అంటు జరిగిపోయినాక, చావు దానంతట అది వచ్చే దాకా, ఎలాగో ఒకలాగ జీవించడం తప్ప మనిషికి మరోమార్గం లేదు. అందరికీ సాధ్యపడని ఆత్మహత్య మినహా" వసంత అన్నాడు. అతను వేదాంతి. గుమాస్తాలలో వేదాంతులు ఉండకూడదని లేదు; వేదాంతులు గుమాస్తాలు కాకూడదని లేదు.

"ప్రభుత్వరంగ సంస్థల అస్వస్థపై కన్నీరు, మున్నీరు కార్చిన వరహాలు అప్పగించిన అనవసరపు పని ముగిసేసరికి నక్కల హూళల వేళవుతుందేమో" క్రిష్ణ అన్నాడు.

"నక్కలు, ఎలుగ్గొడ్లు మన ఇరువురి నగర ప్రాంతాలలో లేవు. ఆ అదృష్టమో, దురదృష్టమో లింగంది. ప్రకృతికి చేరువుగా నివసిస్తున్నాడుగా!" వసంత అన్నాడు.

"నేను గ్రాసం వెతుక్కునే తావు కాంక్రీట్ కీకారణ్యం" శరభలింగం అన్నాడు.

పని పూర్తయ్యేసరికి రాత్రి ఎనిమిదయ్యింది. అయిదు అంతస్తులు దిగి స్కూటర్ షెడ్ దగ్గరకు నడుస్తుంటే వాళ్ల క్రీనీడలు వాళ్ల ముందు పడుతున్నాయి. కీచురాళ్లు అరుస్తున్నాయి బాధతో, ఎవరో వాటిని అవమానించినట్లు. ఎవరి బండి మీద వాళ్లు ఎక్కారు. వీడ్కోలు చెబుతూ వసంత అరిచాడు, "లింగం, అసలే భల్లూకం తిరుగుతోంది మీ ఇళ్ల దగ్గర జాగర్తగా వెళ్లు. కాస్త మనుషులు అలికిడి ఉండే వీధుల గుండా" అరిచి తెచ్చి పెట్టుకున్న నవ్వు నవ్వాడు.

గంటకు పాతిక కిలోమీటర్లు గరిష్ట వేగంతో, దేనినుంచో రక్షణకై ఎక్కడికో పారిపోతున్నట్లు, పయనించి తను నివసిస్తున్న పేట సరిహద్దు చేరాడు లింగం. రెండు మార్గాలలో-గేదెలది, బడిది. ఏదో ఒకటి ఎన్నుకోవాలి. మొదటిదాంట్లో ఎలుగ్గొడ్డు ఎదురవ్వవచ్చు, రెండో దాంట్లో పానకాలు, ఆ కొజ్జా తారసపడవచ్చు. మొదటి దాన్నే లింగం ఎన్నుకున్నాడు. అలిసిపోయినట్లు బండి వేగం మరీ తగ్గిపోయింది. ఆ వీధిలో ఎప్పటిలాగే వీధిలైట్లు లేవు. రాత్రి ప్రేమికులు వెలగనీయరు. ప్రస్తుతం అక్కడ ప్రేమకలాపాలు సాగడం లేదు. నిర్మానుష్యంగా ఉంది. అటూ ఇటూ చెదురుమదురుగా ఇళ్లున్నాయి. వాటి తలుపులు మూసుకునున్నాయి. ఆర్తనాదాలు వినబడకుండా నేమో. బండి లైట్ దూరానికి బలహీనంగా పడుతోంది. ఏదో నీడ అల్లక్కడ కదులుతోంది. ఏమిటో అది? మనిషి ఆకారం మాత్రం కాదు. బండి వెనక్కి మళ్లించి పారిపోవచ్చు. కాని నిర్భయంగా ప్రయాణం ముందుకే సాగుతోంది....

■

